సాక్షి ఆదిలాబాద్

బుధవారం : 3 : జూలై : 2024



ట్రిపుల్ ఐటీకి తగ్గిన పోటీ

బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు సంబంధించి గతంతో పోలిస్తే ఈ సారి దరఖాస్తులు సగానికి తగ్గాయి. మెరిట్ జాబితాను అధికారులు నేడు విడుదల చేయనున్నారు. 8లో▸

నియామకం



ఆదిలాబాద్: బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ఇన్‌చార్జిగా జిల్లా కేంద్రానికి చెందిన జాబాడే రాష్ట్ర పాల్ నియామకమయ్యారు. ఈ మేరకు మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నియామక పత్రం జారీ చేసినట్లు రాష్ట్ర పాల్ పేర్కొన్నాడు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నైరుతి ప్రభావంతో పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం అందరి బాధ్యత అని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో మెడికోలు, వైద్యులతో కలిసి మంగళవారం మొక్కలు నాటారు. ఆవరణలో వెయ్యి మొక్కలు నాటే లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, ఇద్రిస్ అక్బాని, వైద్యులు తిప్పస్వామి, సుమలత, శ్యామ్‌ప్రసాద్, శోభ పవార్, సందీప్ పవార్, చంద్రశేఖర్ మెడికోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయంపై ప్రభుత్వం దృష్టి



మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్‌కుమార్

ఇచ్చోడ: ప్రభుత్వం ముల్తానీలకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల కోసం కృషి చేస్తుందని ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని కేశవపట్నం గ్రామ ముల్తానీలతో అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కవ్వాల్ టైగర్ జోన్ పరిధి బావోజిపేట్ బీట్ 174 కంపార్ట్‌మెంట్‌లో అడవిని అక్రమంగా నరికి వ్యవసాయం చేస్తుండటంతో అందులో అటవీ అధికారులు మొక్కలు నాటుతున్నారని తెలిపారు. అయితే ఈ కార్యక్రమాన్ని కొద్ది రోజులుగా ముల్తానీలు అడ్డుకుంటున్నారని, ఇది సరికాదన్నారు. సమావేశంలో తహసీల్దార్ తుకారాం, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్‌రామారావు, సిరిచెల్మ రెంజ్ అధికారి గణేశ్, డిప్యూటీ రెంజ్ అధికారి గీరయ్య, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డీఈవో

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నం.2ను మంగళవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన నిర్వహణ తీరును పరిశీలించారు. నాణ్యతగా వండి పెట్టాలని నిర్వాహకులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకముందు తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో పాఠాలు చదివించారు. యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం తదితర విషయాలను వారి ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సీసీ రాజేశ్వర్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్‌లో పనిచేసేందుకు అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. గతంలో ఇచ్చిన ప్రకటనను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సర్‌ప్లస్ ఉన్న ఉపాధ్యాయులు సంబంధిత ప్రధానోపాధ్యాయుల అనుమతితో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్ఏ గణితం, ఫిజికల్ సైన్స్, బయో సైన్స్, సాంఘికశాస్త్రం, ఇంగ్లిష్, హిందీ, తెలుగు పోస్టులు ఒక్కొక్కటి చొప్పున, ఎస్జీటీ పోస్టులు 2, పీఈటీ పోస్టు ఒకటి ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.



జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు (ఫైల్)

అంగన్‌వాడీపై ఫోకస్

- ఖాళీల భర్తీకి ప్రభుత్వం సన్నద్ధం
- త్వరలోనే నోటిఫికేషన్..?
- వేకెన్సీ గుర్తించాలని డీడబ్ల్యూవోలకు ఆదేశాలు
- రోస్టర్ పాయింట్ నిర్ధారణకూ గడువు
- 65 ఏళ్లు దాటితే రిటైర్మెంట్
- ఆ పోస్టులను కూడా నింపే యోచన

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు..
మొత్తం కేంద్రాలు : 1,256

అంగన్‌వాడీ పోస్టులు : 1,256
పనిచేస్తున్న టీచర్లు : 1,160, ఖాళీలు : 96

హెల్పర్ పోస్టులు : 1,256
పని చేస్తున్నవారు : 857, ఖాళీలు : 399

సాక్షి,ఆదిలాబాద్: అంగన్‌వాడీ ఖాళీలపై సర్కారు దృష్టి సారించింది. వాటిని భర్తీ చేసేందుకు అడుగులు వేస్తుంది. దీనికి సంబంధించి త్వరలో నోటిఫికేషన్ విడుదల కానుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈమేరకు మార్గదర్శకాలను సిద్ధం చేస్తున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్ నుంచి జూలై 1న ఓ ఉత్తర్వు జిల్లాల సంక్షేమ అధికారులకు అందింది. దాని ప్రకారం టీచర్లు, హెల్పర్ల ఖాళీలను గుర్తించాలని ఆదేశించారు. అంతేకాకుండా ఆయా ఖాళీలకు రోస్టర్ పాయింట్ కూడా నిర్ధారించాలని సూచించారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో మహిళ శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఐదు ప్రాజెక్టులు (ఆదిలాబాద్‌అర్బన్, బోథ్, జైనథ్, నార్నూర్, ఉట్నూర్) ఉన్నాయి. వీటి పరిధిలో 1,256 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఇందులో నార్నూర్, ఉట్నూర్ ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో ఏజెన్సీ పరిధిలోకి వస్తాయి. మిగతా ప్రాజెక్ట్‌ల్లోనూ ఏజెన్సీ ప్రాంతాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే ప్రభుత్వం షెడ్యూల్డు ఏరియాల్లో ఆ ప్రాంత వారికే వంద శాతం రిజర్వు చేయనున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా అంగన్‌వాడీ టీచర్‌కు సంబంధించి గతంలో పదో తరగతి ఉత్తీర్ణతపై భర్తీ చేసేవారు. తాజాగా మార్గదర్శకాలు మారినట్లు తెలుస్తోంది. ఇంటర్మీడియెట్ అర్హతగా తాజా పోస్టులను భర్తీ చేయనున్నారు. హెల్పర్‌కు ఇదివరకు 4వ, 7వ తరగతి అర్హతగా ఉండగా, ఇప్పుడు వారిని కూడా ఇంటర్మీడియెట్ అర్హతగా నిర్ధారించారు. దీంతో అంగన్‌వాడీ విద్యను పటిష్ఠం చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే టీచర్, హెల్పర్ పోస్టుల ప్రామాణికం పెంచినట్లు అధికారులు చెబుతున్నారు.

రోస్టర్ పాయింట్ నిర్ధారణకు గడువు..

అంగన్‌వాడీ ఖాళీల గుర్తింపుతో పాటు వాటికి సంబంధించి రోస్టర్ పాయింట్ సిద్ధం చేయాలని తాజా ఉత్తర్వుల్లో ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ రోస్టర్ పాయింట్ నిర్ధారణలో డీడబ్ల్యూవో, సీడీపీవోలు కీలకంగా వ్యవహరించనున్నారు. ఈనెల 4 నుంచి 12 వరకు రోస్టర్ పాయింట్‌ను సిద్ధం చేయాలని గడువు విధించారు.

65 ఏళ్లు దాటిన అంగన్‌వాడీల రిటైర్మెంట్..

ఇక 65 ఏళ్లు దాటిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రభుత్వం రిటైర్మెంట్ ప్రకటించింది. జూలై 1 నుంచి వారికి అటెండెన్స్ కూడా నిలిపివేసింది. బెనిఫిట్స్ కింద టీచర్లకు రూ.1లక్ష, హెల్పర్లకు రూ.50వేలు అందజేయనుంది. అయితే ఈ నిర్ణయంపై అంగన్‌వాడీలు వ్యతిరేకిస్తున్నారు. బెనిఫిట్స్ అధికంగా ఇస్తామని గతంలో చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు మాట మారుస్తుందని ఆరోపిస్తున్నారు. ఆసరా పింఛన్‌కు అర్హులుగా ప్రకటిస్తామని పేర్కొన్నప్పటికీ, 65 ఏళ్లు దాటిన తమకు సహజంగానే పింఛన్ వస్తుంది కదా అని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే.. జిల్లాలో 65 ఏళ్లు దాటిన వారు 200 మంది వరకు ఉన్నట్లు జిల్లా అధికారులు ఇప్పటికే హైదరాబాద్‌కు జాబితా పంపారు. కాగా తాజాగా భర్తీ చేయాలనుకుంటున్న అంగన్‌వాడీ పోస్టుల్లో ఈ ఖాళీలను కూడా పరిగణలోకి తీసుకోనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

దీన్నే నమ్ముకొని ఉన్నాం..



నేను అంగన్‌వాడీ టీచర్‌గా 42 ఏళ్లుగా పనిచేస్తున్నా. నా లాగే అనేక మంది దశాబ్దాలుగా దీన్నే నమ్ముకొని ఉన్నారు. ప్రభుత్వం 65 ఏళ్లు దాటిన వారికి రిటైర్మెంట్ ఇస్తుంది. అయితే మాకు గతంలో ప్రభుత్వం చెప్పిన విధంగా ప్రయోజనాలు కల్పించాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలి.

– రాధ, అంగన్‌వాడీ టీచర్

త్వరలోనే నోటిఫికేషన్..



అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి సంబంధించి ప్రభుత్వం నుంచి త్వరలోనే నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. వేకెన్సీ గుర్తించాలని, రోస్టర్ పాయింట్ సిద్ధం చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఈనెల 4న హైదరాబాద్‌లో జిల్లా సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నారు. మార్గదర్శకాలపై ఆ సమావేశంలో పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

– సబితా, జిల్లా సంక్షేమ అధికారి

‘అవిశ్వాస’ తేదీ ఖరారు

- 18న మున్సిపల్ ప్రత్యేక సమావేశం
- నోటీసుల జారీకి బల్దియా కసరత్తు
- నేడు కాంగ్రెస్ గూటికి మరో ముగ్గురు కౌన్సిలర్లు?



ఆదిలాబాద్ బల్దియా కార్యాలయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్ రంజానీపై బీజేపీ, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసానికి సంబంధించిన సమావేశ తేదీ ఖరారైంది. ఈ నెల 18న ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్‌కు కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ అందించిన నివేదికను పరిశీలించిన కలెక్టర్ తేదీ ఖరారు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో అవిశ్వాసం నెగ్గడంపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు దృష్టి సారిస్తుండగా, వీగిపోయేందుకు అధికార కాంగ్రెస్ ప్రత్యేక వ్యూహం అనుసరిస్తోంది. ఇందులో భాగంగా ఆపరేషన్ ఆకర్ష్‌ను వేగవంతం చేసింది. అవిశ్వాస నోటీసు అందించిన వారిలో నుంచి పలువురు కౌన్సిలర్లను కాంగ్రెస్ గూటికి లాగేలా పావులు కదుపుతోంది.

నోటీసుల జారీకి కసరత్తు

మున్సిపల్ పరిధిలో చైర్మన్‌తో కలిసి 49 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఎక్స్ అఫిషియో హోదాలో ఓటు వేసేందుకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ సైతం దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో ఈ సంఖ్య 50కి చేరింది. అయితే అవిశ్వాసానికి సంబంధించిన ప్రత్యేక సమావేశం ఈ నెల 18న మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఆ రోజున సభ్యులంతా హాజరుకావాలని పేర్కొంటూ ఒక్కొక్కరికి వ్యక్తిగతంగా నోటీసులు అందజేయనున్నారు. బుధవారం తుది గడువు కావడంతో బల్దియా యంత్రాంగం నోటీసుల జారీకి కసరత్తు చేపట్టింది.

ఇదీ పరిస్థితి..

ఈ నెల 18న నిర్వహించనున్న ప్రత్యేక సమావేశం కోసం అవిశ్వాస నోటీసు అందించిన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్ల సంతకాలను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా సమావేశ తేదీని ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్డీవో వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ సమావేశం చేపట్టనున్నారు. అవిశ్వాసానికి సంబంధించి సమావేశం జరగాలంటే మొత్తం కౌన్సిలర్లలో 2/3వంతు అంటే 33 మంది హాజరు కావాల్సి ఉంటుంది. తీర్మానం నెగ్గాలన్నా అంతే బలం అవసరమవుతుంది. చేతులెత్తే విధానంతో అవిశ్వాస అనుకూల, వ్యతిరేక మద్దతుదారులను లెక్కించనున్నారు. ఒకవేళ అవిశ్వాసంనకు నిర్దేశిత బలం ఉంటే వైస్ చైర్మన్ తన పదవి కోల్పోవాల్సి ఉంటుంది. లేకుంటే వీగిపోయినట్లే.

అయితే కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌ను వేగవంతం చేసిన నేపథ్యంలో పలువురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అధికార పార్టీలోకి వచ్చే అవకాశమున్నట్లుగా తెలుస్తోంది. తాజాగా ఇద్దరు సీనియర్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరగా మరో ముగ్గురు వారి బాటలోనే నడుస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇందులో ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఉండగా, మరొకరు కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరిన సభ్యుడు ఉన్నట్లు సమాచారం. వీరితో కాంగ్రెస్ పార్టీ

ఆపరేషన్ ఆకర్ష్

సీనియర్ కౌన్సిలర్ ఇప్పటికే మంతనాలు జరుపగా పార్టీలో చేరేందుకు వారు కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మంత్రి సీతక్క అపాయింట్‌మెంట్ కూడా కోరారు. ఈ ముగ్గురు కౌన్సిలర్లు బుధవారం మంత్రి సమక్షంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్ కండువాను కప్పుకోనున్నారు. కాగా 33 మంది కౌన్సిలర్ల సంతకాలతో అవిశ్వాస నోటీసు అందజేసిన బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు ఆ సంఖ్యను కాపాడుకోలేకపోతున్నట్లు తెలుస్తోందిరు. సంతకాలు చేసిన వారిలో ఇప్పటికే ఇద్దరు చేజారగా తాజాగా మరో ముగ్గురు దూరమయ్యే పరిస్థితి ఉంది.

‘రూం టు రీడ్ ఇండియా’ సేవలు అభినందనీయం

- కలెక్టర్ రాజర్షి షా



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: రూం టూ రీడ్ ఇండియా ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఒకటి, రెండు తరగతుల కోసం ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన డికోడబుల్ టెక్స్‌బుక్‌ను కలెక్టర్ మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సంస్థ ప్రతినిధులతో కలిసి వాటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పాఠ్యపుస్తకాల ద్వారా ఒకటి, రెండు తరగతుల పిల్లలు సులభంగా నేర్చుకుంటారన్నారు. ఇందులో ట్రస్ట్ రాష్ట్ర మేనేజర్ నరసింహాచారి, ఎంఎంవో శ్రీకాంత్ గౌడ్, ఎస్.ప్రవీణ్, ప్రాజెక్టు అధికారి నితిన్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్, వేణుగోపాల్ తదితరులున్నారు.

కొత్తవారు వస్తేనే కదిలేది!

- ఎస్జీటీ బదిలీల్లో విద్యాశాఖ ట్విస్ట్
- ఆందోళనలో పలువురు ఉపాధ్యాయులు

బోథ్: ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఎస్జీటీల బదిలీలు జరిగాయి. ఇందులో భాగంగా జిల్లాలోనూ పలువురికి స్థానచలనం కలిగింది. అయితే తమ స్థానంలో కొత్త టీచర్ వస్తేనే వారు ఆ పాఠశాల నుంచి రిలీవ్ కావాల్సి ఉంటుందని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. చాలా చోట్ల తాము పనిచేస్తున్న వద్దకు బదిలీపై టీచర్లు రాకపోవడంతో ట్రాన్స్‌ఫర్ అయిన ఉపాధ్యాయులు అక్కడి నుంచి రిలీవ్ కాని పరిస్థితి. దీంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలువురు దంపతులు స్పౌజ్ కేటగిరీ ద్వారా బదిలీకి ఆప్షన్ ఇచ్చారు. అయితే పలు చోట్ల ఒకరు బదిలీపై వెళ్లగా.. మరొకరు తాను విధులు నిర్వహించే పాఠశాలలో వారి స్థానంలో ఇంకొకరు రాకపోవడంతో పాత స్థానంలోనే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. జిల్లాలో 810 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. అయితే ఒకరి స్థానంలో మరొకరు రాని కారణంగా దాదాపు 90 శాతం వరకు ఉపాధ్యాయులు బదిలీ అయిన ప్రాంతానికి వెళ్లలేని పరిస్థితి. అయితే ఖాళీగా ఉన్న స్థానాల్లో విద్యావలంటీర్లను నియమించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

‘హామీల అమలులో ప్రభుత్వం విఫలం’



మాట్లాడుతున్న రామన్న

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా హామీల అమలులో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తప్పా మిగతా ఏ హామీ నెరవేర్చలేదని మండిపడ్డారు. పక్క రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రోజుల వ్యవధిలోనే హామీలను అమలు చేస్తుందని గుర్తు చేశారు. సకాలంలో పింఛన్లు అందక వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అలాగే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందకపోవడంతో అన్నదాతకు అప్పులు తప్పడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలకే పరిమితమవుతూ, ప్రజాసమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. ఇందులో పార్టీ నాయకులు అజయ్, యూనుస్ అక్బాని, సాజిదొద్దీన్, ధమ్మపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యం

- గంజాయి సాగు చేస్తే ప్రభుత్వ పథకాలు కట్
- విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు
- కలెక్టర్ రాజర్షి షా



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, పక్కన ఎస్పీ గౌస్ ఆలం తదితరులు

కైలాస్‌నగర్: జిల్లాలో మత్తు పదార్థాలను సమూలంగా నిర్మూలించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఎక్సైజ్, విద్యాశాఖ, డీడబ్ల్యూవో, రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ తదితర శాఖల అధికారులతో మత్తు పదార్థాల నివారణ, సాగు, రవాణాను అరికట్టేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గంజాయి సాగు చేసే రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయమని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి మత్తు పదార్థాల ద్వారా కలిగే అనర్థాలపై అవగాహనను కల్పించాలని సూచించారు. ఈ కమిటీలో పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను భాగస్వాములుగా చేయాలన్నారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక ర్యాలీలు, వ్యాసరచన, డ్రాన్స్ పోటీలు నిర్వహిస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే తరచూ హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 35 కేసుల్లో 111కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని 67 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే 42 మంది విక్రయదారులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మహారాష్ట్రతో సరిహద్దు ఉన్నందున రైలు, రోడ్డు మార్గాల్లో విక్రయదారులు జిల్లా కేంద్రానికి గంజాయి తరలించేందుకు యత్నిస్తున్నారు. వీటిని అడ్డుకునేందుకు పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉందన్నారు. సమావేశంలో ఆర్డీవో వినోద్‌కుమార్, మహిళా శిశు, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులు సబిత, సునీతకుమారి, డీఈవో ప్రణీత, డీఐఈవో రవీందర్, ఎక్సైజ్ సూరింటెండెంట్ హిమశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కైలాస్‌నగర్: వర్షాకాలం నేపథ్యంలో రానున్న మూడు నెలల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, డీపీవో, పోలీస్, ఇతర శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గతేడాది ఆయా ప్రాంతాల్లో జరిగిన సంఘటనలకు తావివ్వకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. దెబ్బతిన్న రోడ్లు, ఇళ్లను గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. 312హ్యాబిటేషన్లలో వర్షాకాలంలో ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా ఆయా ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ముందుగానే మూడు నెలలకు సరిపడా సరుకులు, పౌష్టికాహారం, తదితర సరఫరా చేయాలని సూచించారు. ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్ మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముందస్తుప్రణాళిక ప్రకారం అధికారులు అప్రమత్తంగా ఉంటూ విపత్తుల నివారణకు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రాజెక్టులు,చెరువులు విషయంలో అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ హాస్టళ్లలో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. డెంగీ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలపై టోల్‌ఫ్రీ నం. 9440811700పై సంప్రదించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో రత్నమాల, ఆర్డీవో వినోద్ కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఈసీ స్కీమ్ కింద పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ప్ర జా వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం (3194) నాయకులు పేర్కొన్నారు. కలెక్టర్ రాజర్షిషాను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, సంతోష్, రవీందర్, సురేష్, సుభాష్, సచిన్, ఏఎన్ఎంలు నీలా, సుధారాణి, తదితరులున్నారు.

ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై కొరడా

- షోకాజ్ నోటీసులు జారీ
- రెండింటికి రూ.5వేల చొప్పున జరిమానా

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై వైద్యారోగ్య శాఖ కొరడా ఝుళిపించింది. ఆస్పత్రుల తనిఖీల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్ ప్రాంతంలో గల రెండు క్లినిక్‌లను మంగళవారం పరిశీలించారు. ఫస్ట్‌ఎయిడ్ కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్నట్లు గుర్తించారు. ప్రాక్టీస్‌తో పాటు బెడ్లు, డాక్టర్ అని బోర్డు ఏర్పాటు చేసుకోవడం, మందులు అందిస్తుండడంతో నోటీసులు జారీ చేశారు. అలాగే ఓ క్లినిక్‌లో ఏకంగా ఓ మహిళకు ఫ్లూయిడ్ ఎక్కిస్తూ కనిపించడంతో వారిపై చర్యలు తీసుకున్నారు. ఒక్కో క్లినిక్‌కు రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. షోకాజ్‌కు రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో మాస్ మీడియా అధికారి వెంకట్‌రెడ్డి, సిబ్బంది రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి తగ్గిన పోటీ

- ఈ ఏడాది సగానికి పడిపోయిన దరఖాస్తులు
- వర్సిటీలో సమస్యలే కారణమంటున్న విద్యావేత్తలు
- నేడు ఎంపిక జాబితా విడుదల
- మెరిట్ విద్యార్థులకు సీట్లు
- ఈ ఏడాదైనా సమస్యలు లేకుండా చదువులు సాగేనా?

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో 2024–25 విద్యా సంవత్సరంలో 1500 సీట్ల భర్తీ కోసం దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా జూన్ 1 నుంచి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా విద్యార్థుల జాబితాను రూపొందించారు. మెరిట్ విద్యార్థుల జాబితాను బుధవారం క్యాంపస్‌లో విడుదల చేయనున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయన్న వివరాలు బుధవారం వెల్లడిస్తామని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. గతంలో వచ్చిన దరఖాస్తుల సంఖ్య ఎప్పటికప్పుడు తెలిపేవారు. కానీ ఈ సారి ఆ సంఖ్య వివరాలను గోప్యంగా ఉంచుతూ దాదాపుగా 15 వేలు వచ్చాయని చెప్తున్నారు. దరఖాస్తుల సంఖ్య వివరాలు ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారనే విషయం తెలియడం లేదు.

విద్యావిధానం...

ఆరేళ్ల సమీకృత ఇంజనీరింగ్ ఆధారంగా బాసర ట్రిపుల్‌ఐటీలో బోధన కొనసాగుతుంది. మొదటి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ కోర్సును నేర్పిస్తారు. అనంతరం మెరిట్ ఆధారంగా మరో నాలుగేళ్ల ఇంజనీరింగ్ సీట్లను ఎంపిక చేసుకోవచ్చు. పీయూసీ విద్య అనంతరం మెరుగైన అవకాశాలు వస్తే ఇక్కడి నుంచి బయటకు వెళ్లి చదువుకునే అవకాశం కూడా ఉంది. నాలుగేళ్ల బీటెక్‌లో సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఈసీఈ, ఎంఎంఈ కోర్సులు అందిస్తున్నారు. మొదటి రెండేళ్ల పీయూసీలో సాధించిన మార్కుల ఆధారంగానే బీటెక్‌లో కోర్సులు కేటాయిస్తారు. ఎంపికైన విద్యార్థులకు బాసర ట్రిపుల్‌ఐటీ అధికారులు ప్రభుత్వం తరఫున వసతులు కల్పిస్తారు. ల్యాప్‌టాప్, ఒకే రకమైన దుస్తులు, షూస్ అందిస్తారు. హాస్టల్, భోజన వసతి కల్పిస్తారు.

పర్యవేక్షణ కరువు...

అంతా బాగున్న బాసర ట్రిపుల్‌ఐటీలో అధికారుల పర్యవేక్షణ కరువైంది. అన్ని శాఖల్లో పూర్తిగా విఫలమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ చదివే విద్యార్థులు సమస్యలు చెప్పుకోలేకపోతున్నారు. స్టూడెంట్ కమిటీని కూడా ఎన్నుకోకుండా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ట్రిపుల్‌ఐటీలో ఏంజరిగినా బయటకు చెప్పకూడదని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఏ విషయం బయటకు వచ్చినా అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటున్నారు. అక్కడంతా బాగుంటే బయట సమాజానికి ఏం చెప్పకపోయినా నష్టమేం ఉండదు. కానీ హాస్టల్ వసతి మొదలుకుని భోజనాల వరకు విద్యార్థులు ఇబ్బందులు పడుతునే ఉన్నారు. హాస్టల్ గదుల్లో, చాలా చోట్ల పెచ్చులూడుతున్నాయి. రంగులు లేక భవనాలు కళావిహీనంగా కనిపిస్తున్నాయి. విద్యుత్ వైర్లు సరిచేయడం లేదు. చాలా చోట్ల హాస్టల్ గదులకు నీళ్లు రావడం లేదు. ఫ్యాన్‌లు తిరగడంలేదు. ఫర్నిచర్ సరైన రీతిలో లేదు. ఇక మెస్‌లలో భోజన వసతి అయితే చెప్పాల్సిన అవసరం లేదు. మరోవైపు సరిహద్దు మహారాష్ట్రలో ఉన్న ఆల్కాహాల్ ఫ్యాక్టరీ దుర్గంధం క్యాంపస్‌ను కమ్మేస్తుంది. విష వాయువులతో నిండిన గాలినే విద్యార్థులు పీలుస్తున్నారు. ఎంతో మంది అనారోగ్యం బారిన పడుతున్నారు. గత ప్రభుత్వంలో విద్యార్థుల నిరవధిక నిరసనలతో అప్పటి మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, కేటీఆర్ క్యాంపస్‌కు వచ్చి విద్యార్థులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. కానీ ప్రభుత్వం మారినా ఇక్కడి సమస్యలు మాత్రం తీరలేదు. ట్రిపుల్‌ఐటీ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనైనా ట్రిపుల్‌ఐటీ సమస్యలు లేకుండా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



బాసర ట్రిపుల్‌ఐటీ

నేడు ఎంపిక...

గ్రామీణ ప్రాంతాల్లో చదివిన విద్యార్థుల జీపీఏ, సామాజిక వర్గం, ఇలా అన్నింటినీ లెక్కలోకి తీసుకుని సీట్లు కేటాయించనున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను అధికారుల బృందం పూర్తిస్థాయిలో పరిశీలించింది. ఇందులో మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తామని, ఆన్‌లైన్‌లో వివరాలు ఉంచుతామని అధికారులు పేర్కొంటున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులంతా ట్రిపుల్‌ఐటీ విడుదలచేసే జాబితా కోసం ఎదురుచూస్తున్నారు. జాబితా విడుదలైతే ట్రిపుల్‌ఐటీలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరయ్యేందుకు విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

గతంతో పోలిస్తే...

బాసర ట్రిపుల్‌ఐటీకి మూడేళ్లుగా వచ్చిన దరఖాస్తులను పోల్చిచూస్తే ఈ ఏడాది అధికారులు చెప్పిన సంఖ్య సగానికి తగ్గిందనే చెప్పవచ్చు. 2020–21లో 32 వేలు, 2021–22లో 20,178, 2022–23లో 31,432, 2023–24లో 32,635 దరఖాస్తులు వచ్చాయి. కానీ ఈ విద్యాసంవత్సరంలో కేవలం 15వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. బాసర ట్రిపుల్‌ఐటీలో సీట్ల కోసం గతంలో వందలాది మంది విద్యార్థులు పోటీపడేవారు. ప్రస్తుతం వచ్చిన దరఖాస్తులను బట్టిచూస్తే ఒక్కో సీటుకు పది మంది మాత్రమే పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



మహేందర్(ఫైల్)

ఇంద్రవెల్లి: గత నెల 11న రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు, ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గౌరపూర్ గ్రామానికి చెందిన కోట్నాక్ ఆనంద్‌రావ్, గిరిజబాయి దంపతుల కుమారుడు కోట్నాక్ మహేందర్ (17) ఇంద్రవెల్లిలోని క్రీసెంట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 11న బైక్‌పై ఇంద్రవెల్లి నుంచి గౌరపూర్ వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి ఆనంద్‌రావ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లైంగిక దాడి కేసులో ఒకరికి జైలు

భైంసాటౌన్: లైంగిక దాడికి యత్నించిన కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ భైంసా కోర్టు న్యాయమూర్తి దేవేంద్రబాబు మంగళవారం తీర్పునిచ్చినట్లు కోర్టు రికార్డు అసిస్టెంట్ చంద్రకాంత్ తెలిపారు. 2018లో కుభీర్ మండల కేంద్రానికి చెందిన గోనిగర్ సాయినాథ్ అదే గ్రామానికి చెందిన మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కుభీర్ ఎస్సై కేసు నమోదు చేయగా భైంసా కోర్టులో విచారణ జరిపారు. ఏపీపీ అరుణ ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

గంజాయి కేసులో పదేళ్ల జైలు

ఆసిఫాబాద్‌అర్బన్: గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పునిచ్చారు. జైనూర్ సీఐ అంజన్న తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దినకర్ సునీల్ 2021 ఆగస్టు 27న ఆటోలో 25 కిలోల 300 గ్రాముల గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డాడు. అప్పటి ఐఓలు తిరుపతి, హనూక్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా పీపీ జగన్మోహన్‌రావ్ సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో జిల్లా జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

భైంసాటౌన్: బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో సుభాష్‌ను మంగళవారం కలిసి విన్నవించారు. ఏళ్లుగా బదిలీ కోసం వేచి ఉన్న ఉపాధ్యాయులకు ప్రస్తుతం బదిలీ చేసినా రిలీవ్ చేయడం లేదన్నారు. దీంతో ఇతర ఉపాధ్యాయుల స్టేషన్ సర్వీస్ తగ్గే అవకాశముందని పేర్కొన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్, నాయకులు శంకర్, రవి జాదవ్, సాగర్ ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు నేడే ఆఖరు

ఆదిలాబాద్‌రూరల్: సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ 2025 (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్ష కోసం అందించనున్న ఉచిత శిక్షణ దరఖాస్తుల స్వీకరణ గడువు బుధవారంతో ముగియనుందని జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పాసై ఆసక్తి కలిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 7న ఆన్‌లైన్ ద్వారా స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అర్హత సాధించిన వారికి ఈ నెల 18 నుంచి శిక్షణ తరగతులను ప్రారంభించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 08732–221280 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



చిన్నయ్య మృతదేహం

బోథ్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాము తెలిపిన వివరాల మేరకు మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన కొత్తపల్లి చిన్నయ్య (59)మంగళవారం మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నూతన చట్టం ప్రకారం బీఎన్ఎస్ ఎస్194 కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లేఅవుట్‌లోని అక్రమ రోడ్డు ధ్వంసం

కైలాస్‌నగర్: మావల మండల కేంద్రంలోని చెరువును ఆనుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఏర్పాటు చేసిన ఓ లేఅవుట్‌లోని రోడ్డును బల్దియా అధికారులు ధ్వంసం చేశారు. బఫర్ జోన్‌లో సదరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా చెరువుకట్టను ఆనుకుని లేఅవుట్‌కు వెళ్లేలా రోడ్డును ఏర్పాటు చేశారు. ఇరిగేషన్ అధికారులు నిర్దేశించిన చెరువు స్థలాన్ని లేఅవుట్‌లో కలుపుకుంటూ ఈ రోడ్డును నిర్మించారు. బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారి అనురాధ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకున్న బల్దియా సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఈ రోడ్డును జేసీబీలతో ధ్వంసం చేయించారు. ప్రభుత్వ స్థలాలతో పాటు బఫర్‌జోన్లలో లేఅవుట్ల ఏర్పాటు చట్ట విరుద్ధమని, అలాంటి వాటిపై కఠినంగా వ్యవహరిస్తామని టీపీవో పేర్కొన్నారు. అక్రమ లేఅవుట్లను సహించబోమని స్పష్టం చేశారు.



బల్దియా అధికారులు తొలగించిన రోడ్డు

ఉపాధి పనులు పరిశీలించిన కేంద్ర బృందం

కడెం/మామడ: కడెం, మామడ మండలాల్లోని ఉపాధి హామీ పనులను కేంద్ర జలశక్తి అభియాన్ టీం సభ్యులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మితో కలిసి మంగళవారం పరిశీలించారు. కడెం మండలం ధర్మాజీపేట్ గ్రామంలో చేపల చెరువు, మద్దిపడగ గ్రామంలో పెర్కులేషన్ ట్యాంక్ తదితర పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మామడ మండలం కొరిటికల్, లింగాపూర్ గ్రామాలలో కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ అధికారి అనిత, సాంకేతిక అధికారి సుశాంత్‌కుమార్ రాతాలు పరిశీలించారు. కొరిటికల్‌లో వాటర్‌షెడ్, లింగాపూర్‌లో పానికి వనం, నర్సరీలను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. భూగర్భ జలాల పెంపునకు చేపడుతున్న పథకాలను తెలుసుకుని సూచనలు చేశారు. ఇందులో సెంట్రల్ టీం సభ్యులు అనిత, సైంటిస్ట్ సుశాంత్, సీసీ గంగాప్రసాద్, ఏపీవో జయదేవ్, ఈజీఎస్ ఏపీవో శివాజీ, ఉపాధిహామీ సిబ్బంది కాంతారావు, శ్రీనివాస్, గణేశ్, మాజీ సర్పంచ్ ప్రవీణ్, తదితరులున్నారు.



మొక్కను నాటుతున్న అధికారులు

‘అడెల్లి’ అమ్మవారి చెంత అపశ్రుతి

- విస్తరాకులు తెంపడానికి వెళ్లి వ్యక్తి మృతి

సారంగాపూర్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద మంగళవారం అపశ్రుతి చోటు చేసుకుంది. గ్రామస్తులంతా కలిసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకునే క్రమంలో తినడానికి విస్తరాకులు తెంపడానికి వెళ్లిన వ్యక్తి ఫెన్సింగ్‌పై నుంచి పడి ప్రాణాలు కోల్పోయాడు. కొట్ల(బి) గ్రామానికి చెందిన కాసారం భీమన్న (50) గ్రామస్తులతో కలిసి అడెల్లి ఆలయానికి వెళ్లాడు. అందరితో కలిసి పండుగ వాతావరణంలో ఉల్లాసంగా గడిపాడు. అన్నం తినే సమయంలో విస్తరాకులు అందుబాటులో లేకపోవడంతో హరితవనంలో ఉన్న మోదుగచెట్టు ఆకులు తెచ్చేందుకు వెళ్లాడు. పార్కు ఫెన్సింగ్ పైకి ఎక్కి దిగే క్రమంలో కాలు జారి రాయిపై పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై సల్ల శ్రీకాంత్ ఘటనా స్థలికి చేరకుని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



కాసారం భీమన్న మృతదేహం

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



గాయాలైన రాజేశ్వర్

దిలావర్‌పూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సిర్గాపూర్ గ్రామానికి చెందిన ఇప్ప రాజేశ్వర్ దిలావర్‌పూర్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం విధులు ముగిసిన అనంతరం భారీ వర్షం కురియడంతో కార్యాలయంలోనే చీకటి పడేంత వరకు ఉన్నాడు. ఆతర్వాత వర్షం తగ్గుముఖం పట్టడంతో ద్విచక్ర వాహనంపై సిర్గాపూర్ బయలు దేరాడు దిలావర్‌పూర్ బస్టాండ్ దాటి కొద్దిదూరం వెళ్ళాక రోడ్డుకు అడ్డంగా ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. వెంటనే వెనుక నుంచి వచ్చిన డీసీఎం సైతం రాజేశ్వర్ బైక్‌ను ఢీకొంది. దీంతో ఎగిరి రోడ్డు పక్కన పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో 108లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నామమాత్రపు ధరలకే మొక్కలు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

మంచిర్యాలఅగ్రికల్చర్: ఐటీడీఏ పరిధిలోని 4 ఉద్యాన నర్సరీలలో నాణ్యమైన మామిడి మొక్కలు, అలంకరణ మొక్కలు నామమాత్రపు ధరలకే అందుబాటులో ఉన్నాయని పీవో ఖుష్బూ గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్, మంచిర్యాల జిల్లా భీమారం, బెల్లంపల్లి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జంబుగా ఉద్యాన నర్సరీలలో ఆయా మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. మామిడి మొక్క రూ.50, క్రోటాన్స్, అలంకరణ మొక్కలు రూ.20, మునగ, కరివేపాకు మొక్కలు రూ.20 చొప్పున అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులకు, రైతు సంఘాలకు, స్వచ్ఛంద సంస్థలకు విక్రయించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇంకా ఇతర రకాల మొక్కలు అవసరమున్నట్లయితే ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. ఇంకా ఇతర రాకల మొక్కలు అవసమున్నట్లయితే ఉత్పత్తి చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఉద్యాన అధికారిని 9032313933 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పీహెచ్‌సీలో ఊడిపడిన టైల్స్

- తాత్కాలిక ఉద్యోగికి గాయాలు

కుంటాల: కుంటాల పీహెచ్‌సీలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న మిర్యాల రవీందర్‌కు మంగళవారం గాయాలయ్యాయి. రోజు మాదిరిగానే రవీందర్ ఉదయం 6:30 గంటల ప్రాంతంలో ప్రభుత్వ వైద్యశాలలో శుభ్రం చేస్తుండగా పైనుంచి టైల్స్ ఊడిపడి తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

266 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా నిల్వ ఉంచిన 266.76 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి సమీపంలో గల గోదాంలో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా నిల్వ ఉంచిన 266 క్వింటాళ్ల 76 కిలోల పీడీఎస్ రేషన్ బియ్యంను లభ్యమయ్యాయి. ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన ముజాహిద్ అనే వ్యాపారి వివిధ ప్రాంతాల్లో కొనుగోలు చేసిన బియ్యం నిల్వ ఉంచినట్లు గుర్తించారు. డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని గోదాంలో ఉంచిన బియ్యాన్ని పరిశీలించి తూకం వేయించారు. సదరు వ్యాపారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. బియ్యానికి పంచనామా నిర్వహించి సివిల్ సప్లై అధికారులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో టూటౌన్ సీఐ అశోక్, సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్ బాబుసింగ్, పోలీసు సిబ్బంది నరేష్, రమేశ్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.



బియ్యం నిల్వలతో డీఎస్పీ, పోలీసులు

జవాన్‌గా.. జానపద కళాకారుడిగా..!

- గీతాల రూపకల్పనలో తనదైన శైలి
- సమాజాన్ని చైతన్య పరుస్తున్న శేఖర్

కుంటాల: బాల్యం నుంచే రచనలు.. పాటలు పాడుతూ.. నటిస్తూ రాణిస్తున్నాడు కుంటాల మండలంలోని మెదన్‌పూర్ గ్రామానికి చెందిన దర్శనం శేఖర్. జవాన్‌గా దేశ సేవ చేస్తూ సెలవుల్లో వచ్చినప్పుడు ఇంటికి వచ్చినప్పుడల్లా సమాజంలోని మార్పులకనుగుణంగా తన కళలతో ప్రజలను చైతన్య పరుస్తున్నాడు.

చిన్ననాటి నుంచి కళలపై మక్కువ..

కుంటాల మండలంలోని మెదన్‌పూర్ గ్రామానికి చెందిన దర్శనం పీరాబాయి–పోశెట్టి దంపతుల రెండో కుమారుడు దర్శనం శేఖర్. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేశాడు. పాఠశాలలో స్వాతంత్ర్య, గణతంత్ర, వార్షికోత్సవాల్లో భాగంగా తనకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాడు. తాను రచించిన పాటలు పాడుతూ.. నటిస్తూ అందరి దృష్టి ఆకర్షించాడు. దేశభక్తి, జానపద పాటలు రాసి తనదైన ప్రత్యేకతను చాటుకున్నాడు. 2010లో ముంబైలో నిర్వహించిన ఎన్‌సీసీ జాతీయ సదస్సులో ఉత్తమ ప్రదర్శన ఇచ్చి అప్పటి కల్నల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కరీంనగర్‌లో స్వర్ణ పతకం సాధించారు. అమ్మా నీరూపమా.. ఆల్బమ్ ద్వారా పేరు సంపాదించి.. ఆకాశవాణిలో పాడిన పాటలకు శ్రోతల మెప్పు పొంది గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రముఖ గాయకుడు అంజయ్య స్ఫూర్తితో రచయితగా గుర్తింపు పొందాడు. 2012లో బీఎస్సీ పూర్తిచేసిన ఆయన ఆర్మీలో ఉద్యోగం సంపాదించాడు. ఆర్మీలో నర్సింగ్ టెక్నీషియన్‌గా చండీగఢ్, ఉదంపూర్, డెహ్రాడూన్‌లో వైద్య సేవలు అందిస్తూ ప్రస్తుతం పూణేలో విధులు నిర్వర్తిస్తున్నా రు. ‘గల్లు..గల్లుమన్నా.. నీచేతిగాజులు’ సీడీని మాజీమంత్రి ఐకే రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అమ్మా నీ రూపమా.. గుండెకు గుచ్చిన.. గాయం నువ్వేనా.. లవ్ ఫెయిల్యూర్.. చంపేస్తుంది నన్ను.. ఇలాంటి 3 వేలకు పైగా సీడీలు రూపొందించారు. తెలంగాణ ఉద్యమంలో తన గొంతుకను వినిపించి ఉద్యమకారులను చైతన్య పరిచారు. పల్లెల్లోని వాతావరణం, సంప్రదాయం, దేశభక్తితో సమాజాన్ని ఎప్పటికప్పుడు చైతన్య పరుస్తూ అన్నీతానై రాణిస్తూ తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు.



సీడీని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఐకే రెడ్డి

ప్రత్యేకత చాటాలని...



చిన్నప్పటి నుంచి పాటలు పాడడం, రాయడం, నటించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. నన్ను అందరూ ప్రోత్సహించారు. దేశ సేవ చేస్తూ జరుగుతున్న పరిస్థితులపై సీడీల ద్వారా రూపొందించడంతో అభిమానులు ఆశీర్వదించారు. ప్రత్యేకత ఉండాలని నిరంతరం కృషి చేస్తున్నా.

– దర్శనం శేఖర్, ఆర్మీ జవాన్

‘రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం సరికాదు’



సమావేశంలో మాట్లాడుతున్న సునీత

- అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత

ఎదులాపురం: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల రిటైర్మెంటు బెనిఫిట్స్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో 65 సంవత్సరాలు పూర్తయిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సుమారు 10 వేల మంది ఉన్నారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని గతేడాది 24 రోజులపాటు నిరవధిక సమ్మెను నిర్వహించగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం టీచర్లకు రెండు లక్షలు, హెల్పర్లకు లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో విరమించామన్నారు. అయితే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వ హామీని పరిగణలోకి తీసుకోకుండా టీచర్లకు లక్ష, హెల్పర్లకు రూ.50 వేలు మాత్రమే అందజేస్తామని నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదన్నారు. వెంకటమ్మ, సునీత, రమేశ్, సోమన్న, బొజ్జ ఆశన్న, కిరణ్ పాల్గొన్నారు.